## క్లుప్తంగా

### తహసీల్‌ను సందర్శించిన ఆర్డీఓ

**చింతకాని:** చింతకాని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ గణేష్ శనివారం సందర్శించారు. మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు సంబంధించి స్థలాన్ని పరిశీలించవల్సిందిగా తహసీల్దార్ రమేష్‌ను ఆదేశించారు. మండలంలోని మత్కేపల్లి, ప్రొద్దుటూరు, నేరడ గ్రామాల్లో ఉన్నటువంటి ప్రభుత్వ స్థలాలను తహసీల్దార్, సర్వేయర్ పరిశీలించారు.

### ఈకేవైసీ తప్పనిసరి


మాట్లాడుతున్న తహసీల్దార్ పున్నం చందర్

**బోనకల్:** మండలం అన్ని గ్రామాల్లోని రేషన్ కార్డుదారులు తమ తమ కార్డులకు రేషన్ డీలర్ల వద్ద రెండు రోజుల్లో ఈకేవైసీ చేయించుకోవాలని పున్నం చందర్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని కార్యాలయంలో నిర్వహించిన రేషన్ డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్‌కార్డుకు వేలిముద్రలు అనుసంధానం(ఈకేవైసీ) చేయించుకోకపోతే సంక్షేమ పథకాలు అందవన్నారు. ఈ సమావేశంలో డీటీ కరుణాకర్‌రెడ్డి తదితరులున్నారు.

### సమస్యలు పరిష్కరించండి


కమిషనర్ కె.సుజాతకు సూచనలు చేస్తున్న డాక్టర్ మట్టా దయానంద్

**సత్తుపల్లిటౌన్:** సత్తుపల్లిలోని సరస్వతీ ఆలయం ఎదురుగా గల డబుల్‌బెడ్‌రూం ఇళ్ల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ కె.సుజాతను జిల్లా కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ కోరారు. శనివారం డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పరిశీలించి మాట్లాడారు. డ్రెయినేజీ, తాగునీరు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణి, ఎండి కమల్‌పాషా, గాదె చెన్నారావు, పింగళి సామేలు, అలవాల కరుణాకర్, గోలి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

### ల్యాప్‌టాప్ వితరణ

**వైరా:** గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు ఉండ్రు వరలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం ప్రథమ వివాహ వార్షికోత్సవం జరుపుకుంటున్న లయన్ లగడపాటి శ్రీచరిత డాక్టర్ అవినాష్‌లు దాతృత్వంతో డిగ్రీ చదువుతున్న వైరాకు చెందిన గుత్తా శ్రీనిజకు ల్యాప్‌టాప్ వితరణ చేశారు. కార్యక్రమంలో పీడీజీ డాక్టర్ కాపా మురళీ కృష్ణ, జీఎంటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు, ఆర్‌సీ లగడపాటి ప్రభాకర్‌రావు, పోతినేని భూమేష్, లగడపాటి లక్ష్మి, స్వరాజ్యం, తోటకూర శ్రీకాంత్, ఉయ్యూరి రామకృష్ణ, జాలా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

**పెనుబల్లి:** విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సత్తుపల్లి రూరల్ సీఐ వెంకటేష్, ఆర్‌టీఓ వెంకట పుల్లయ్య తెలిపారు. మండలంలోని ఉప్పల చలక కెజీబీవీ పాఠశాలకు వీజీఎఫ్ ట్రస్ట్ రూ.50 వేలతో అందిచిన ల్యాబ్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. అదే విధంగా ఆర్థిక సాయం అందించిన వీజీఎఫ్ ట్రస్ట్ చైర్మన్ ఆళ్ల రంగాను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ వెంకటరమణ, సూర్యనారాయణ, నరసింహారావు, భద్రకాళి, రజిని పాల్గొన్నారు.

### ఆరుతడి పంటలకు నీరు అందించాలి

**ముదిగొండ:** మంగాపురం మేజర్ పరిధిలో సాగుచేసిన ఆరుతడి పంటలకు సాగునీరందించాలని చిరుమర్రి రైతులు తెలంగాణరైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నీటి పారుదల శాఖ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ ధనకు మార్‌రెడ్డికి ఖమ్మంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ.. సాగర్‌జలాలను విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి వరప్రసాద్, జిల్లాకమిటీ సభ్యులు సుదర్శన్, కోలేటి ఉపేందర్, రైతులు పాల్గొన్నారు.

### మొక్కు చెల్లించుకున్న కాంగ్రెస్ నాయకులు

**తల్లాడ:** ఎమ్మెల్యేగా మట్టా రాగమయి గెలుపు పట్ల తల్లాడ మండల కాంగ్రెస్ నాయకులు శనివారం యదవరం ఉగ్ర నరసింహస్వామి సన్నిధిలో పూజలు నిర్వహించి తమ ముడుపులు చెల్లించుకున్నారు. సత్తుపల్లితో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, జిల్లాకు ముగ్గురు మంత్రులు కావడంతో ఖమ్మం జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని వారు నల్గొండ జిల్లా యద్రవరంలో కొలువుదీరిన నరసింహస్వామికి పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు రామారావు, నాగిరెడ్డి, మల్లిఖార్జున్‌రావు, జోసఫ్, కృష్ణయ్య పాల్గొన్నారు.


దోరు లేకుండా మట్టి తీసుకెళ్తున్న ట్రాక్టర్


ట్రాక్టర్‌లో మట్టి నింపుతున్న జేసీబీ

# ఆగని మట్టి దందా..

- మట్టి మాఫియాపై ఇంటెలిజెన్స్ ఆరా..
- వాహనాలకు నంబర్ ప్లేట్లు, పత్రాలు ఉండవు
- చర్యలు తీసుకోని అధికారులు

**అక్రమ మట్టి దందాకు అడ్డూ అదుపు లేకుండా సాగిపోతుంది.. దర్జాగా మట్టి తోలకాలు చేస్తున్న అధికార యంత్రాంగం చేష్టలూడి చూస్తుండిపోవటం పట్ల ప్రజలు విస్తుపోతున్నారు. మట్టి మాఫియా ఆగడాలను అరికట్టేందుకు చర్యలను చేపట్టడంలో సంబంధిత శాఖలు ఒకరిపై ఒకరు నెపాన్ని నెట్టేసుకుంటూ తప్పించుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.**

**సత్తుపల్లి:** మట్టి దందాకు రాజకీయ అండదండలు ఉండటంతో దీనిపై నోరుమెదిపేందుకు అధికారులు సైతం ఇష్టపడటం లేదు. రెవెన్యూశాఖ మట్టి దందాను అరికట్టడం తమ పనికాదంటూ.. గ్రామ కార్యదర్శి స్థాయి నుంచి ఎంపీడీఓ కట్టడి చేయాలని.. రెవెన్యూపాత్ర తక్కువేనంటూ చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. అదే రెవెన్యూశాఖ ఇప్పటికీ పదుల సంఖ్యలో కేసులు నమోదు చేసి జరీమానాలు విధించిన సంఘటనలు ఉన్నాయి. రాజకీయ ఒత్తిడితో ఫిర్యాదులు వస్తే రెవెన్యూ యంత్రాంగం ఆగమేఘాల మీద చర్యలకు పూనుకుంటుందనే విమర్శలు ఉన్నాయి.

**మితిమీరిన వేగం..**

అక్రమ మట్టితోలకాలు జరిపే ట్రాక్టర్లు, టిప్పర్లు మితిమీరిన వేగంతో రోడ్లపై పరుగులు పెట్టడం సర్వసాధారణమైంది. దీంతో జనం భయంతో ఉరుకులు పెట్టాల్సి వస్తుందంటూ లబోదిబోమంటున్నారు. దుమ్మూ ధూళితో వేగంగా దూసుకొస్తూ.. రోడ్డుపై మట్టి పెళ్లలు పడేస్తూ వెళ్తుంటారు. వీటికి సరిగ్గా, డోర్లు, నంబర్ ప్లేట్లు ఉండవు.. కన్పించవు.. ఇక ఇన్సూరెన్స్ సంగతి చెప్పాల్సిన పనిలేదు. ఇదంతా రవాణాశాఖ కార్యాలయం ముందు నుంచే వెళ్తున్నా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

**మైనింగ్‌శాఖ దృష్టిసారిస్తే..**

సత్తుపల్లి డివిజన్‌లో జరుగుతున్న అక్రమ మట్టి దందాపై మైనింగ్‌శాఖ దృష్టి సారించకపోవటం పట్ల పలు విమర్శలు వస్తున్నాయి. వాహనాలు పట్టుబడినప్పుడు తీరిగ్గావచ్చి జరిమానాలు విధించి వెళ్లిపోవటం మినహా మైనింగ్‌శాఖ చర్యలు అంతంతమాత్రంగానే ఉన్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.

**మట్టికి పెరిగిన డిమాండ్..**

సత్తుపల్లి పట్టణం దినదినాభివృద్ధి చెందటంతో రియల్‌ఎస్టేట్ వ్యాపారం, నూతన ఇల్లు కట్టడాలు ఎక్కువగానే ఉంటున్నాయి. ప్రతిరోజు ఏదో ఒక చోట మట్టి అవసరాలు నిత్యకృత్యం కావటంతో మట్టి మాఫియా చెలరేగిపోతుంది. డిమాండ్‌ను బట్టి అప్పటికప్పుడు మట్టి ధరలను పెంచేసుకుంటూ సామాన్యుడికి మట్టిని కూడా అందుబాటులో లేకుండా చేస్తున్నారు.

**ఇంటిలిజెన్స్ ఆరా..**

మట్టి మాఫియా ఆగడాలపై ఇంటిలిజెన్స్ ఆరా తీసే పనిలో నిమగ్నమైంది. 'సాక్షి'లో 'మాఫియా కనుసన్నల్లోనే..': 'నచ్చితే నజరానా.. లేకుంటే జరిమానా!' అనే కథనాలతో కదలిక వచ్చింది. మట్టి మాఫియాను ఎవరు నడుపుతున్నారు.. దీనికి రాజకీయ అండదండలు ఏమైనా ఉన్నాయా? మట్టిని ఎక్కడ తవ్వుతున్నారు..? ఎంత మంది ముఠాలుగా ఏర్పడి మట్టి తవ్వకాలు జరుపుతున్నారో అనే విషయాలపై అంతర్గతంగా విచారణ చేస్తున్నట్లు సమాచారం.

# అధైర్యపడకండి..


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య

**సత్తుపల్లి:** రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజం.. ప్రజలిచ్చిన తీర్పును స్వీకరించాలి.. రాజకీయ విమర్శలకు సమయం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. సత్తుపల్లి పట్టణంలోని బీఆర్‌ఎస్ క్యాంప్ కార్యాలయంలో శనివారం నల్గొండ సభ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృష్ణాజలాలపై కేంద్రం పెత్తనంపైనే రాజకీయాలకు అతీతంగా కేసీఆర్ నల్గొండ సభ జరుగుతుందన్నారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు, స్వామినాథన్‌కు భారతరత్న అవార్డు ఇవ్వటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తెలుగు ప్రజల ఆరాధ్యదైవం ఎన్టీ రామారావుకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, మండల, పట్టణ అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు, ఎస్‌కె రఫీ, దొడ్డా శంకర్‌రావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, మట్టా ప్రసాద్, ఎస్‌కె చాంద్‌పాషా, ఎస్‌కె ఆయూబ్‌పాషా, చల్లగుండ్ల కృష్ణయ్య, మోదుగు పుల్లారావు, వల్లభనేని పవన్, మోరంపూడి ప్రభాకర్‌రావు, ప్రసాద్, మందపాటి వాసిరెడ్డి పాల్గొన్నారు.

**పోస్టర్లు ఆవిష్కరణ..**

**వేంసూరు:** ఈ నెల13 నల్లగొండలో జరిగే మహాసభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. శనివారం మండలంలోని లచ్చన్న గూడెంలో ఛలో నల్లగొండ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షులు పాలా వెంకటరెడ్డి, సురేష్, సోమిరెడ్డి, జమలరావు, ప్రసాద్‌రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ


బహుమతులు గెలుచుకున్న విద్యార్థులు

**మధిర:** హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం నిర్వహించిన రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌లో మర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మర్లపాడు స్కూల్ ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. ఈ టాలెంట్ టెస్ట్‌కు తెలంగాణలోని 33 జిల్లాల నుంచి పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ప్రథమ బహుమతిని పసుపులేటి నందిని, ద్వితీయ బహుమతిని లక్కిరెడ్డి రామ్మోహన్ రెడ్డి గెలుచుకున్నారు. అలాగే విజేతల తల్లిదండ్రులను వేదికపై ప్రముఖ సంఘ సంస్కర్త నక్క శ్రీనివాస్ యాదవ్ ఘనంగా సన్మానించారు. విద్యార్థుల విజయంపై ప్రధానోపాధ్యాయుడు పి.భీమరాజు హర్షం వ్యక్తం చేసి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభావంతులని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ విజయం పట్ల ఉపాధ్యాయుల బృందం విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## మెగా టాలెంట్ టెస్ట్..


విద్యార్థినులకు ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం

**మధిర:** పట్టణంలోని భరత్ టెక్నో స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన మెగా టాలెంట్ టెస్ట్‌కు జిల్లా నలుమూలల నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుల సమక్షంలో భరత్ విద్యా సంస్థల అధినేతలు శీలం విద్యాలత, వెంకటరెడ్డి చేతుల మీదుగా ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. ఈ టాలెంట్ టెస్టుకు 1,200 మంది విద్యార్థులు పైగా హాజరవడంతో హర్షం వ్యక్తం చేశారు. అలాగే విద్యార్థులను పంపిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు, ప్రధాన ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

**బాలికల ప్రతిభ..**

పట్టణంలోని భరత్ విద్యాసంస్థలు నిర్వహించిన టాలెంట్‌టెస్ట్‌లో ఎంపీపీఎస్ బాలికలు ప్రతిభ కనపరిచారని ప్రధానోపాధ్యాయుడు వై.కోటారెడ్డి పేర్కొన్నారు. టాలెంట్ టెస్ట్‌లో జె.షణ్ముఖ ప్రియ 6వ ర్యాంకు, వి.హర్షిత 7వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయులు రామకృష్ణ, అగ్రిత్, శోభారాణి అభినందించారు.

# కేన్సర్ నిర్ధారణ శిబిరం ప్రారంభం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్‌జడ్జి అరుణకుమారి

**సత్తుపల్లిటౌన్:** ప్రపంచాన్ని వణికిస్తున్న కేన్సర్ మహమ్మారి నివారణ కోసం లయన్స్‌క్లబ్, చేతన ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థలు కృషి అభినందనీయమని సత్తుపల్లి సీనియర్ సివిల్‌జడ్జి పి.అరుణకుమారి అన్నారు. సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రి పరిశోధనా కేంద్రం సహకారంతో నిర్వహించిన కేన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. రక్తపరీక్ష, ఎక్స్‌రే యూనిట్లను మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, వైస్ చైర్మన్ తోట సుజలారాణి, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌లు ప్రారంభించారు. చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇరువురి మహిళలకు కుట్టు మిషన్లను డాక్టర్ మట్టా దయానంద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం వైద్య శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ నిర్వాహకులు దొడ్డా కృష్ణయ్య, పెనుకొండ రమేష్, శ్రీనివాసరావు, కృష్ణారావు, చలపతిరావు, ప్రభాకర్‌రెడ్డి, గండ్ర సోమిరెడ్డి, సత్యనారాయణ, రవి, హరిబాబు, రమేష్‌రెడ్డి, కొంగర రామచంద్రరావు, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

## గ్రూప్-4 ఫలితాల్లో యువకుడి ప్రతిభ


అజీజ్

**వైరా:** రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన గ్రూప్-4 ఫలితాల్లో వైరా బ్రాహ్మణపల్లికి చెందిన షేక్ అజీజ్ అహ్మద్ జిల్లా స్థాయిలో 57వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 1,300వ ర్యాంకు సాధించాడు. అజీజ్ ఇటీవల ప్రకటించిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో సైతం ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. తొలి ప్రయత్నంలోనే రెండు ఉద్యోగాలకు ఎంపిక కావడం పట్ల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

**బోనకల్:** అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, జిల్లా సమితి సభ్యుడు తూము రోషన్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సమస్యలు పరిష్కరించాని కోరుతూ.. స్థానిక తహసీల్ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలను అమలు చేసే ముందు అర్హులైన వారికి రేషన్ కార్డులను జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి అకెన పవన్, శ్రీకాంత్ తదితరులున్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఎస్‌బీఎస్ పాఠశాల పూర్వ విద్యార్థులు

**సత్తుపల్లి:** సత్తుపల్లిలోని శ్రీబండి శోభనాచలం ప్రభుత్వ పాఠశాలలో 1982–83 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 42 ఏళ్ల తర్వాత సత్తుపల్లిలో శనివారం కలుసుకున్నారు. ఈ సమ్మేళనానికి దేశ, విదేశాలలో ఉన్నవారంతా చేరుకొని ఆనాటి జ్ఞాపకాలను, అప్పటి స్నేహ మాధుర్యాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అమెరికా నుంచి ముప్పా రవి, కిషోర్, ఢిల్లీ నుంచి లత హాజరయ్యారు. నేషనల్‌హైవే ఒంగోలు ఈఈఈ మెరుగు విద్యాసాగర్‌రావు, భద్రాద్రికొత్తగూడెం పీఆర్‌ఈఈ శ్రీనివాసరావు, సుబ్బారావు, రాజగోపాలాచారి, ఖలీల్, సత్యనారాయణ, షమీవుద్దీన్, శ్రీను, శ్రీదేవి, శాంతిరెడ్డి, సుశీల, విమల పాల్గొన్నారు.

**మిట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..**


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

**తల్లాడ:** మండలంలోని మిట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2006–07వ సంవత్సరం పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం ఘనంగా జరిగింది. వెంకటగిరి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఆర్‌బీ గార్డెన్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మేడి నాగేశ్వరరావు, యన్నం రామక్రిష్ణారెడ్డి, పటాన్ బాజి, ఉపేందర్, నల్గొండ శంకర్, వేల్పుల అశోక్, ధర్మసోత్ కృష్ణ, రేష్మ, అనురాధ, శైలజ, అప్పమ్మ, నాగమణి, ప్రశాంతి పాల్గొన్నారు.

## విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలి

**ఎర్రుపాలెం:** రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టిన ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యారంగానికి మొత్తం బడ్జెట్లో కేవలం ఏడున్నర శాతం కేటాయింపులు మాత్రమే చేశారని, కేటాయింపులు మరింతగా పెంచాలని మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారు నాగరాజు, అనుమోలు కోటేశ్వరరావులు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. కొఠారి కమీషన్ చెప్పినట్లుగా 30 శాతం కాకున్నా కనీసం 20 శాతమైనా కేటాయించాల్సి ఉందన్నారు. తెలంగాణలో నూతనంగా పాఠశాలలు ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని, ఉన్న పాఠశాలలనే దశలవారీగా పబ్లిక్ స్కూల్స్‌గా మారిస్తే సరిపోతుందన్నారు. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసి, మౌలిక సౌకర్యాలను కల్పించి, పర్యవేక్షణ యంత్రాంగాన్ని పటిష్టం చేస్తే విద్యారంగం అభివృద్ధి చెందుతుందన్నారు.

## పాలాభిషేకం

**కారేపల్లి:** బంజారాల ఆరాధ్య దైవంగా భావించే సంత్ సేవాలాల్ మహారాజ్ జన్మదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 15వ తేదీని సెలవు దినంగా ప్రకటించటం పట్ల మండలంలోని బంజారాలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం కారేపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కచిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తలారి చంద్రప్రకాశ్, సురేందర్ మనియార్, టోనీవీరప్రతాప్, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు వాంకుడోతు గోపాల్ నాయక్, సొసైటీ డైరెక్టర్ హీరాలాల్, గుగులోత్ భీముడు నాయక్, ఆలోత్ నందరాజ్, ధరావత్ వినోద్, రాంచందర్, షేట్‌రాం, తేజావత్ రఘు, గుగులోత్ మంగ్యా, బాబు, రాంబాబు, ఖామ్‌సింగ్, రవీందర్, చంద్రునాయక్, గణేష్, బాబుసింగ్, రమేష్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, ఈరు, రవినాయక్ పాల్గొన్నారు.

# న్యాయం చేయాలని ఫిర్యాదు



ముదిగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన అమ్మపేట రైతులు

**ముదిగొండ:** తప్పుడు రిపోర్టు ఇచ్చిన హార్టీకల్చర్ అధికారి, శాస్త్రవేత్తపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని అమ్మపేట రైతులు శనివారం ముదిగొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ముదిగొండ మండలం అమ్మపేటకు చెందిన వడ్డెలి శ్రీనివాసరావు, బెజవాడ రాధాకృష్ణ, రేగళ్ల కృష్ణయ్య, ఊటుకూరి బాబులతో పాటు మరికొంతమంది రైతులు వీరాంజనేయ హైటెక్ నర్సరీలో సెమినాస్ 1377, అంకూర్ రేణుక సీడ్స్ మిరప మొక్కలు కొనుగోలు చేశారు. కల్తీ విత్తనాల వల్ల అవి నెలరోజులైనా కాత, పూత లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. హార్టీకల్చర్ అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి శ్రీకొండాలక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీ వారికి రిఫర్ చేయగా ఓ శాస్త్రవేత్త మిరపతోటలను పరిశీలించారని రైతులు తెలిపారు. ఇవి సెమినాస్ 1377 విత్తనం కాదని చెప్పి వెళ్లిన 20రోజుల తరువాత రిపోర్టు మార్చి తప్పుగా జెమిని వైరస్ వచ్చిందని రిపోర్టు ఇచ్చారని రైతులు ఆరోపించారు. తప్పుడు రిపోర్టు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని రైతులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## 'గృహజ్యోతి' వివరాలు తెలపాలి

**తల్లాడ:** గృహజ్యోతి పథకం లబ్ధిదారులు తమ వివరాలను విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలని విద్యుత్ శాఖా ఏఈ రాజేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహజ్యోతి పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారు.. కరెంట్ సిబ్బంది ఇంటికి వచ్చి నప్పుడు ఇంటి వద్ద లేనట్లైతే సంబంధిత పత్రాలు జిరాక్స్‌లను తల్లాడ విద్యుత్ రెవెన్యూ కార్యాలయం, లేదా సబ్ స్టేషన్‌లో ఈ నెల 15వ తేదీలోగా అందజేయాలని ఏఈ కోరారు.

## పుడమి సాహితీ వేదిక అధ్యక్షుడిగా అచ్యుత్


అచ్యుత్

**వైరా:** పుడమి సాహితీ వేదిక (సామాజిక సేవా విభాగం) ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా వైరాకు చెందిన రామన అచ్యుత్, ప్రధాన కార్యదర్శిగా పల్లిపాడుకు చెందిన తాటిపల్లి సుధీర్‌లను నియమించి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చిలుముల బాలరెడ్డి శనివారం నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా అచ్యుత్ మాట్లాడుతూ.. జిల్లాలో సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

## సన్మానాలు..

**ఏన్కూరు:** మండలంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఇటీవేల పదవీ విరమణ చేసిన గ్రామ సర్పంచ్ వర్సా రాంబాబుకు శనివారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చింతా రాజు మాట్లాడుతూ.. సర్పంచ్ గ్రామ అభివృద్ధితో పాటు పాఠశాల అభివృద్ధికి కృషి చేశారని అతడి సేవలను కొనియాడారు.

**కారేపల్లి:** మండలంలోని తొడితలగూడెం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బానోత్ కుమార్, మాజీ ఉప సర్పంచ్ ఢిల్లీ లక్ష్మిలను గ్రామస్తులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తొడితలగూడెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనసూయ, విజయ, ఎఎస్‌ఎం ధనలక్ష్మి, కోటమ్మ, అంగన్‌వాడీ టీచర్‌లు అరుణ, విజయ కుమారి, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

# మిస్ట్‌లో ముగిసిన వర్క్‌షాపు


శిక్షణ పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

**సత్తుపల్లిరూరల్:** సత్తుపల్లి మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో మూడురోజుల పాటు ఇంజనీరింగ్ విద్యార్థులకు ఫండమెంటల్స్‌అండ్ అప్లికేషన్ ఆఫ్ మ్యాట్‌ల్యాబ్‌పై నిర్వహించిన వర్క్‌షాప్ శనివారం ముగిసింది. తెలంగాణ, ఆంధ్రాప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వివిధ ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. హైద్రాబాద్ వివిఎస్‌ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ వై.పద్మసాయి, రిసోర్స్‌పర్సన్ ఎల్‌వి రజనికుమారిలు కమ్యూనికేషన్ రంగంలో భవిష్యత్ తరాలకు ఉపయోగపడే సిగ్నల్‌ను విశ్లేషణ చేయటం, మిషన్ లెర్నింగ్ అప్లికేషన్స్ అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, ఐక్యూ కోఆర్డినేటర్ ఎంవి రామచంద్రరావు, ఈసీఈ విభాగం అధిపతి జి.ఉదయ్‌కిరణ్, భార్గవ్, బీఆర్ ప్రదీప్ పాల్గొన్నారు.

## ఎస్సెస్సీ విద్యార్థులకు వీడ్కోలు


విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

**వైరా:** వైరాలోని మేరీ ఇమ్మాక్యులేట్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సిస్టర్ సోఫియా, హెచ్‌ఎం సిస్టర్ నీనాలు విద్యార్థులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. పదో తరగతి నుంచే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని చదవాలన్నారు. అనంతరం బాల బాలికలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సిస్టర్ బెన్నెట్, సిస్టర్ సుశీల, సిస్టర్ స్మిత కురియన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అయోధ్యకు బయలుదేరిన భక్తులు

**కొణిజర్ల:** రామదర్శన్ యాత్ర అభియాన్‌లో భాగంగా ఖమ్మం నుంచి అయోధ్యకు ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలులో కొణిజర్ల మండల కేంద్రం, తనికెళ్లకు చెందిన 350 మందికి పైగా భక్తులు శనివారం బయలు దేరి వెళ్లారు. కార్యక్రమంలో అనుముల భరత్‌కుమారశర్మ, బండారు నరేష్, మల్లిఖార్జున్, తుప్పతి నరేష్, చింతల మల్లిఖార్జున్, దర్గయ్య, గురుదత్త భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

## కొత్తతండాలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

**కారేపల్లి:** మండలంలోని కొత్తతండా గ్రామంలో శ్రీఆంజనేయస్వామి విగ్రహ, ధ్వజస్తంభం, ముత్యాలమ్మ విగ్రహ, బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు శనివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు సురేష్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలతో గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమాల్లో సొసైటీ వైస్‌చైర్మన్ మంగీలాల్, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, సంతగుడి చైర్మన్ ఐలయ్య, వీరన్న, రాంకిషోర్, వినోద్, సురేష్, నాగు, సిసింద్రీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

**కొణిజర్ల:** మండలంలోని పల్లిపాడులో గల కార్తీక్ విద్యాలయ 32వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కరస్పాండెంట్ నల్లబోలు మాధవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వైరా మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్, ఎంఈఓ మోదుగు శ్యాంసన్, ఎస్సై శంకరరావులు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. అనంతరం బాల బాలికలు చేసిన నృత్యాలు ఆకట్టుకోగా.. హాస్య నాటికలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ భాగ్యలక్ష్మి, పెద్దలు వీరయ్య, చలపతిరావు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మహాసభలను విజయవంతం చేయండి

**టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక..**

**ఎర్రుపాలెం:** ఈ నెల 11,12 తేదీల్లో ఖమ్మం పట్టణంలో నిర్వహించనున్న టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కౌన్సిల్ బి.ముత్తయ్య, మండల కమిటీ అధ్యక్షుడు హనుమంతరావులు కోరారు. శనివారం మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ శిక్షణ శిబిరంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణ, గురుమూర్తి, సీతారామయ్య, సత్యవతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**విప్లవ పార్టీల ఐక్యతా..**

**సత్తుపల్లిటౌన్:** మార్చి 3, 4, 5వ తేదీల్లో ఖమ్మంలో జరిగే విప్లవ పార్టీల ఐక్యత మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో శనివారం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. దేశంలోని మోదీ ప్రభుత్వం రాజ్యాంగం ద్వారా రాష్ట్రాలకు సంక్రమించిన ఫెడరల్ హక్కులను కాలరాస్తుందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నాయకులు పుల్లయ్య, ఎ.వెంకన్న, శ్రీను, శరత్, లాజర్, రాజు, వెంకటనర్సమ్మ, కృష్ణవేణి, దేవి పాల్గొన్నారు.